పోలింగ్‌కు వేళాయె

- దక్షిణలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారుల చర్యలు

దక్షిణ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు :	2,16,769
పురుషులు :	1,06,443
మహిళలు :	1,10,293
ఇతరులు :	33
పోలింగ్ కేంద్రాలు :	235
ప్రిసైడింగ్ అధికారులు :	235
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు :	235
పోలింగ్ సిబ్బంది :	705
రిజర్వ్ సిబ్బంది :	10 శాతం
సెక్టార్ అధికారులు :	14
సూపర్‌వైజర్లు :	14
బీఎల్వోలు :	235

దాబాగార్డెన్స్/కంచరపాలెం : నేటి ఓట్ల పండగకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 235 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 2 లక్షల 16 వేల 769 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో లక్షా 6 వేల 444 మంది పురుషులు, లక్షా 10 వేల 293 మంది మహిళలు, 33 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పోలింగ్ సామగ్రి తరలింపు..

టర్నర్ చౌల్ట్రీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి పోలింగ్ సామగ్రి తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం పొద్దు పోయే వరకు ఆర్టీసీ బస్సుల ద్వారా ఈ ప్రక్రియ కొనసాగింది.

దక్షిణలో కేంద్రాలివే..

శ్రీకన్య రోడ్డు, రైల్వే న్యూకాలనీ, జ్ఞానాపురం, జ్ఞానాపురం రైల్వే కాలనీ, అల్లిపురం, కొబ్బరితోట ఏరియా, అచ్చియ్యమ్మపేట, పాతబస్టాండ్ ఏరియా, రిజర్వ్ పోలీస్ స్ట్రీట్, బంగారమ్మమెట్ట, వేంకటేశ్వరమెట్ట, భీమ్‌నగర్, నీలమ్మ వేపచెట్టు, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, వెలంపేట, రంగిరీజువీధి, చిలకపేట, గోడేవారి వీధి, లక్ష్మీ టాకీస్ ఏరియా, నల్లా వారి వీధి, వాడవీధి, ఆత్మకూరి వారి వీధి, సోల్జర్ పేట, చిన్నమ్మవారి వీధి, కోటవీధి, కన్వేయర్ బెల్ట్ ఏరియా, కదిరి దానప్ప వీధి, గంగాబత్తుల వారి వీధి, విప్పర్తివారి వీధి, పాత పోస్టాఫీస్ ఏరియా, అంబుసరంగ్‌వీధి, ఫెర్రీరోడ్డు, వసంతరావు పేట, టౌన్‌హాల్ ఏరియా, బుక్కా వీధి, అగ్రహారం వీధి, ఉల్లిపాయల వీధి, కాదంబరి వారి వీధి, చెంగల్రావుపేట ఏరియా, కొత్త అగ్రహారం, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ ఏరియా, కొత్త సాలిపేట, కేజీహెచ్ డౌన్ ఏరియా, టర్నర్ చౌల్ట్రీ, అఫీషియల్ కాలనీ,


జ్ఞానాపురం పోలింగ్ కేంద్రం

కలెక్టరేట్ ఏరియా, కృష్ణానగర్, దండుబజార్ ఏరియా, ఆంథోనీనగర్, డాబాగార్డెన్స్, గొల్లలపాలెం, చాకలిపేట, బ్యాంక్ కాలనీ, లలితాకాలనీ, ఆశీల్‌మెట్ట, శ్రీనగర్, టీబీ ఆస్పత్రి రోడ్డు, లలితానగర్, దొండపర్తి, ద్వారకానగర్, రైల్వే క్వార్టర్స్, మండా వారివీధి, సీబీఎం దొండపర్తి, రైల్వే న్యూకాలనీ ఓంకార్‌నగర్, సౌత్ జైల్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో గల జీవీఎంసీ స్కూళ్లు, కమ్యూనిటీ భవన్‌లలో ఓటర్లు తమ హక్కు వినియోగించుకోనున్నారు.


దాబాగార్డెన్స్ ఆదాయ పన్ను శాఖ కార్యాలయం పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల సామగ్రి


రామకృష్ణా స్కూల్ వద్ద ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మంచి నీటి కేంద్రం


మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలు

వార్డు	పోలింగ్ కేంద్రం
40వ వార్డు	1 నుంచి 16
41వ వార్డు	17 నుంచి 28
31వ వార్డు	70, 71, 72, 88, 91, 92, 199, 200 నుంచి 216
32వ వార్డు	12 నుంచి 16, 29 నుంచి 40
33వ వార్డు	56, 57, 58, 59, 60, 61, 62, 63, 64, 65, 66, 67, 68, 69, 73, 74, 75, 76
34వ వార్డు	35, 41 నుంచి 49
35వ వార్డు	50 నుంచి 55 వరకు, 77 నుంచి 82వరకు, 84 నుంచి 87వరకు
36వ వార్డు	89, 90, 93, 95 83, 144 నుంచి 153 వరకు, 158 నుంచి 161
30వ వార్డు	162 నుంచి 181వరకు
29వ వార్డు	182 నుంచి 198 వరకు 199,
39వ వార్డు	96, 97, 98, 99 నుంచి 118 వరకు 38వ వార్డు 119, 128 వరకు
37వ వార్డు	129 నుంచి 143వరకు, 154 నుంచి 157 27వ వార్డు 217 నుంచి 235 వరకు


ఎంజీఎం హైస్కూల్లో ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌ల పనితీరు పరిశీలిస్తున్న సిబ్బంది

ఒక్కో పోలింగ్ కేంద్రంలో 2 నుంచి 10 బూత్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో బూత్‌కి పోలింగ్ ఆఫీసర్‌తో పాటు సహాయక సిబ్బందిని ఏర్పాటు చేశారు. 235 పోలింగ్ స్టేషన్లకు సుమారు 705 మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎటువంటి వైర్‌లెస్ సెట్స్ వాడకుండా చర్యలు చేపట్టారు. 40 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

లైవ్ వీడియో ద్వారా పోలింగ్ సరళి పర్యవేక్షణ

నియోజకవర్గంలో 237 పోలింగ్ బూత్‌లు ఉండగా, ప్రతి పోలింగ్ బూత్‌లో 1:4 నిష్పత్తిలో పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, మరో ముగ్గురు సిబ్బంది ఉంటారు. భద్రతా సిబ్బందితో కలిపి ప్రతి బూత్‌లో 10 నుంచి 15 మంది విధుల్లో ఉంటారు. ఎన్నికల తీరును ఆర్వో, వీర్వోలు లైవ్ వీడియో ద్వారా రిటర్నింగ్ కార్యాలయాల్లో ఎప్పటికపుడు పర్యవేక్షిస్తుంటారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఆయా పీఎస్‌ల నంబర్లు, సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు రాసి ఉంచారు. ఎన్నికల విధులకు అవసరమైన ఫర్నిచర్, కరెంట్, వాటర్, టాయిలెట్లు, ఫస్ట్ ఎయిడ్ సదుపాయం కల్పించారు. ఓటర్లు కూర్చోవడానికి కుర్చీలు, ప్రతి బూత్ వద్ద నీడ కల్పించడానికి టెంట్లు వేశారు. అలాగే వృద్ధులు, వికలాంగులు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు వీలుగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు, వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. దక్షిణ నియోజకవర్గంలో 235 ప్రిసైడింగ్ అధికారులు, 235 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 235 మంది బీఎల్‌వోలు, 705 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారితో పాటు రిజర్వ్ సిబ్బంది, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు కూడా ఎన్నికల విధుల్లో ఉన్నారు.

క్లుప్తంగా

18న కన్యకాపరమేశ్వరి జయంతి

దాబాగార్డెన్స్ : పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 18న కన్యకాపరమేశ్వరి జయంతి నిర్వహించనున్నట్టు దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు వేకువ జాము 3 గంటలకు సుప్రభాత సేవతో మొదలై ప్రత్యేక క్షీరాభిషేకం, రజత వస్త్రాలంకరణ, స్వర్ణపుష్పాలతో ప్రత్యేక పూజా కార్యక్రమం, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజ, వాసవీ మూలమంత్ర హోమం వంటి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

పోలింగ్ బూత్‌ల వద్ద హెల్త్ క్యాంప్‌లు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని, ఎవరైనా వడదెబ్బకు గురైనా, ఏ విధమైన అనారోగ్య సమస్య సంభవించినా దగ్గరలో ఉన్న మెడికల్ క్యాంపులో సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 6 నుంచి శిబిరంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అధికారులు శిబిరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. జూమ్ మీటింగ్ ద్వారా వైద్యాధికారులు ఫీల్డ్ స్టాఫ్‌ను పర్యవేక్షించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందు వల్ల వడదెబ్బ తగలటం, ఇతర సమస్యలు తలెత్తకుండా మంచినీరు, ఇతర పానీయాలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఒకవేళ వడదెబ్బ తగిలితే దగ్గరలో ఉన్న వైద్య శిబిరంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలన్నారు. ఓటర్లందరూ తగు జాగ్రత్తలు తీసుకుని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

దాబాగార్డెన్స్ : విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ఉపాధ్యక్షుడు రమేష్‌చంద్ జైన్ సూచించారు. వన్‌టౌన్ ఏరియా గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న బాల బాలికల మనోవికాస వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు, విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పి. జగనమోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, వేసవి శిక్షణ శిబిరం చైర్మన్ డి. కనకవల్లి, వైస్ చైర్మన్ ఏఆర్ భానుమతి, ఎం. నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తికి సహకరించండి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తికి ఉక్కు మంత్రిత్వశాఖ సహకరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కేంద ఉక్కు కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హాను కోరారు. స్టీల్ ప్లాంట్ పర్యటనకు విచ్చేసిన ఆయనను ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు ఆదివారం కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు అందరూ పూర్తి స్థాయి ఉత్పత్తి తీయడం ద్వారా ప్రభుత్వానికి, యాజమాన్యానికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీరుకొండ రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్ పాల్గొన్నారు.

సేవకుడికా.. వలసవాదికా?

- ఆలోచించి ఓటెయ్యండి
- నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్ వ్యవస్థకా?
- దోచుకున్న జన్మభూమి కమిటీలకా?



దాబాగార్డెన్స్ : ఓటరు మహాశయులు ఆలోచించి ఓటు వేసే రోజు రానే వచ్చింది. స్థానికంగా ఉంటూ.. నియోజక వర్గ ప్రజలతో మేమకమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించే నాయకుడికా? లేక ఈ ప్రాంత సమస్యలపై అవగాహన లేని.. సమస్యలు పట్టని స్థానికేతరుడికా? ఆలోచించి ఓటు అనే ఆయుధంతో తీర్పు చెప్పాలి. నియోజకవర్గం బరిలో 16 మంది నిలిచినప్పటికీ ప్రధాన పోటీ వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి నిలబెట్టిన జనసేన అభ్యర్థి మధ్యే. వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ స్థానికుడు.. మత్స్యకారుడు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారు. వారంలో మంగళ, శుక్రవారాల్లో వివిధ ప్రాంతాల్లో ప్రజాదర్బార్‌లు నిర్వహించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించి ఎన్నో కుటుంబాల్లో ఆనందం నింపారు. సొంత నిధుల నుంచి ఎంతో మంది అనారోగ్య కారణంగా మంచం పట్టిన వారికి, ఆస్పత్రి పాలైన బడుగు, బలహీన వర్గాలకు రూ.3 కోట్ల వరకు ఆర్థిక సాయం చేసిన నాయకుడతను. ప్రభుత్వ పరంగా పాతనగరానికి కొత్త రూపు తీసుకొచ్చారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టించారు. మరీ ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఒక్క పైసా లంచం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఇక జనసేన నేత చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానికేతరుడు. విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి రెండు సార్లు పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అయినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆరేళ్ల పాటు ప్రజా సేవ చేసుకునే అవకాశాన్ని ఎమ్మెల్సీ రూపంలో ఇచ్చారు. అయితే అతను ఆ అవకాశాన్ని కాలదన్నుకున్నారు. అక్కున చేర్చుకుని, ఆదరించిన జగన్‌మోహన్‌రెడ్డిని కాదని.. ఎమ్మెల్సీ పదవిని వదిలిపెట్టి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా బరిలో నిలిచారు. నిజానికి ఆయనకు నియోజకవర్గంపై ఏ మాత్రం పట్టులేదు. అంతెందుకు..ఓల్డ్ సిటీని గ్రీన్ సిటీ చేస్తానని ప్రచారంలో గొప్పగా చెప్పుకున్నారు కానీ.. వాస్తవానికి ఓల్డ్ సిటీ పొల్యూషన్ సిటీ కావడంలో వంశీ పాత్ర కూడా ఉందని తెలుసా? ఎలా అంటే విశాఖ పాతనగరవాసులు కాలుష్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఎంతో మంది మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆస్పత్రుల పాలయ్యారు. ఇంకొందరు మంచం పట్టారు. మిగిలిన అనేక మంది శ్వాస కోశ వ్యాధులు, చర్మ వ్యాధుల బారిన పడ్డారు. ఇదంతా పోర్టు కాలుష్య సమస్య కారణంగానే. వంశీకృష్ణ శ్రీనివాస్‌కు చెందిన 24 టిప్పర్లు పాతనగరం చుట్టూ తిరుగుతూ కాలుష్యం వెదజల్లుతున్నాయి. మరి కాలుష్యానికి కారణం అతను కాదా? అటువంటి వ్యక్తి పాతనగరాన్ని ఎలా గ్రీన్‌సిటీ చేస్తారు? పోర్టు చుట్టూ తన టిప్పర్లు తిప్పడం మానేస్తారా? ఇదిలా ఉండగా నియోజకవర్గంపై కొంచెం కూడా పట్టులేక.. ఎక్కడ ఏ సమస్య ఉందో తెలియకపోయినా దక్షిణలో పోటీకి దిగారు వంశీకృష్ణ శ్రీనివాస్. అతను గెలిస్తే వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందుతాయా? లేదా జన్మభూమి/జనసైనికుల ద్వారా అందుతాయా? ఓటర్లు తెలుసుకోవాలి. లేదా ఏకంగా సంక్షేమ ఫలాలకు స్వస్తి పలుకుతారా? అనేది తెలుసుకోవాలి. చంద్రబాబు హయాంలో వృద్ధులు.. వికలాంగులు.. వితంతువులు పింఛన్ల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. వచ్చిన పింఛన్‌లో కొంత జన్మభూమి కమిటీలు కమిషన్ కింద కొట్టేసి మిగిలింది ఇచ్చేవారు. ఇప్పుడు మరలా ఆ పరిస్థితి దాపురించనుందా? విజ్ఞులైన ఓటర్లే ఆలోచించాలి.



సృష్టిలో తీయనైనది.. తల్లి ప్రేమ ఒక్కటే


రూపాకుల విశాలాక్షి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

మహారాణిపేట : మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఘనంగా జరిగింది. రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ ముందుగా స్వాతంత్య్ర సమరయోధురాలు, తామరపత్ర గ్రహీత స్వర్గీయ రూపాకుల విశాలాక్షి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సృష్టిలో తీయనిది, చల్లనిది అమ్మ ప్రేమ అన్నారు. రాజీవ్ గాంధీ మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాల(దివ్యాంగురాలు) ఎర్నింటి లక్ష్మిని డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, తలాడ గిరిజ, గూడ మైథిలి, జయంతి అన్నపూర్ణ, మౌనిక తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. లక్ష్మణరావు, గేదెల శ్రీహరి, జయంతి అన్నపూర్ణ, ఫణి కాత్య, క్షీరాబ్ధి సాయి దుతి, ఆముక్త, మంగ, రమణ, కొండమ్మ, ఆనంద్, ఆదినారాయణ, మౌనిక, కిరణ్, రాము, బంగారమ్మ, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాతృమూర్తులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

మాతృమూర్తులకు పాదపూజ..

జగదాంబ : స్వామి వివేకానంద సంస్థలో ట్యూషన్ విద్యార్థులు తల్లులకు పాదపూజ చేశారు. ఆదివారం మాతృమూర్తుల దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 39వ వార్డు వివేకానంద సంస్థలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లులను సత్కరించారు. సంస్థ నిర్వాహకులు మట్లాడుతూ తల్లి మాత్రమే స్వచ్ఛమైన ప్రేమను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేడుకగా ఐటీసీ, ఆర్‌ఆర్ టీం వార్షికోత్సవం

దాబాగార్డెన్స్ : ఐటీసీ గ్లోబల్, ఆర్‌ఆర్ టీం ఫ్రీడమ్ మూడో వార్షికోత్సవం ఆదివారం ప్రేమసమాజం అనాథ బాల బాలికల మధ్య వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్దా శివాజీ, కోశాధికారి గుప్త, నిర్మాత పీఎస్ తిలక్, ఐటీసీ గ్లోబల్ వ్యవస్థాపకుడు డాక్టర్ రతన్‌రాజ్, కో ఫౌండర్ డాక్టర్ డి. లాజరస్‌తో పాటు ఐటీసీ గ్లోబల్, ఆర్‌ఆర్ టీం ఫ్రీడమ్ సభ్యులు పాల్గొని కేక్ కట్ చేసి పిల్లలకు తినిపించారు. అనంతరం కళాకారులు మిమిక్రీ శ్రీనివాస్, జూనియర్ రాజబాబు, గాయకురాలు కుమారి, యాంకర్ జయంతి బాలబాలికలను సాంస్కృతిక కార్యక్రమాలతో అలరింపజేశారు. ఈ సందర్భంగా ప్రేమ సమాజానికి ఫ్యాన్లు, ఎల్ ఈడీ బల్బులు అందజేశారు. రతన్‌రాజ్, లాజరస్ మాట్లాడుతూ మూడో వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రాలోనే కాక తెలంగాణ, బెంగళూర్‌లో కూడా రక్తదాన శిబిరం, అన్నదానం, పేదలకు వస్త్రదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంస్థల సభ్యులు, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రేమసమాజం అధ్యక్షుడు శివాజీకి ఫ్యాన్లు, ఎల్ ఈడీ లైట్లు అందజేస్తున్న అతిథులు

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి


లంకెలపాలెంలో ఆది శంకరాచార్యులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భక్తులు


పరవాడలో రామానుజాచార్యుల జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పరవాడ: సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ, లంకెలపాలెం గ్రామాల్లో ఆదివారం దేవాలయాలు కేంద్రంగా ఆది శంకరాచార్యులు, రామానుజాచార్యులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధి రాము మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం అన్ని పీఠాధిపతులు శక్తి పీఠాలను ఒక చోట చేర్చి హిందూ ధర్మం కోసం పని చేయాలని చెప్పిన వ్యక్తి ఆదిశంకరాచార్యులున్నారు. కులమతాలకు అతీతంగా అంతా సమానంగా ఉండాలన్నారు. దేవాలయాల్లో అందరూ సమానమేనని శంకరాచార్యులు పేర్కొన్నారని వివరించారు. కార్యక్రమంలో మాతృమూర్తులు దాసరి లక్ష్మి, చంద్రకళ, ఎస్.లక్ష్మి, పరవాడలో ఎలమర్తి వెంకటరమణ, పి.రామచంద్రావు, ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన తిరునక్షత్రం పూజలు


హంస మూలన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యుల జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలోని హంసమూలన వరాహలక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవితో పాటు రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని అధిష్ఠంపజేసి షోడశోపచార పూజలు చేశారు. తిరువీధిని ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మహిళా వాకర్స్ క్లబ్ సేవానిరతి

మురళీనగర్: మాతృ దినోత్సవంలో భాగంగా మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మురళీనగర్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి అధ్యక్షతన ముఖ్య అతిథి వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ టి.రంగారావు చేతుల మీదుగా 18 మంది మహిళలకు చీరలు, పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. జనరేషన్ యువలో ఆశ్రయం పొందుతున్న వారికి వాటర్ బాటిళ్లు, శీతల పానీయాలు అందించారు. కార్యక్రమంలో 101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షులు సిహెచ్. వరలక్ష్మి, టి.లీలానాయుడు, కోశాధికారి పి.కమల పాల్గొన్నారు.


వృద్ధురాలికి చీర, పండ్లు అందిస్తున్న అతిథులు

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం శ్రీకాకుళానికి చెందిన బి.తారకరామారావు అనే దాత రూ.1.05 లక్షలు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేసి దర్శనం కల్పించారు.

శ్రీశారదాపీఠంలో ఘనంగా శంకర జయంతి

పెందుర్తి: విశాఖ శ్రీశారదాపీఠంలో జగద్గురు ఆది శంకరాచార్యులు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా ఆది శంకరుడికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గురు పూజ, గురు వందనం జరిగాయి. వేదపండితులు, వేద పాఠశాల గురువులు, వేద విద్యార్థులు స్వామీజీకి గురువందనం సమర్పించి ఆశీసులు తీసుకున్నారు. అద్వైత వ్యాప్తికి శంకరాచార్యులు ఎనలేని కృషి చేశారని స్వామీజీ పేర్కొన్నారు.


శంకరాచార్యులుకు పూజలు చేస్తున్న స్వామీజీ

అసంగానంద ఆశ్రమంలో..

ఏయూ క్యాంపస్: అసంగానంద ఆశ్రమం ప్రాంగణంలో నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయ సముదాయంలో శంకర జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిశంకరుల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.